# ఓ ఆకలి కథ

ఈరోజు ఉదయాన్నే మా పెరట్లోకి ఓ పిల్లి వచ్చింది. ఓ పక్కంతా తెగిపోయి, పేగులు బయటికి వచ్చి మూతి పగిలిపోయి రక్తం ఓడుకుంటూ అది నీరసంగా ఓ మూల పడుకుంది.

'నాటు తాళంలో బ్రేకు చూడు'

పాటతో నిద్ర లేచిందగ్గరనుంచి అందరి మెదళ్ళు తినేస్తున్న మా చిన్నబ్బాయిని ఆ పిల్లి దీనావస్థ కదిల్చివేసింది. అయితే పిల్లిని చూస్తే వాడికి భయం. గతంలో ఎప్పుడో ఓసారి పిల్లి వాడిమీద దాడి చేసిన సంఘటన అందరికీ గుర్తుచేసి ఎవరేనా ఆస్పత్రికి దాన్ని శీఘ్రంగా తీసుకు పొమ్మని సలహా ఇచ్చాడు. పైగా వాడికి పుట్టెడు ఏడుపు కూడా వచ్చిందిట. ఆ పిల్లిని చూసి చుట్టూ ప్రపంచం మునిగిపోయినాసరే, ఇది ఫలానా వాడి పత్రిక, ఇది ఫలానా ప్రింటింగ్ ప్రెస్‌లో అచ్చయింది, ఇత్యాది వివరాలతో సహా కూలంకషంగా పేపర్ పఠించిగానీ యోగ ముద్రలోంచి బయట పడని మావారు అతి కష్టంమీద పేపర్ కింద పడేసి, పిల్లి పరీక్ష కోసం దొడ్లోకి వచ్చారు. ఆయన డాక్టరు కాకపోయినా, దాన్ని వెనక నుంచి ముందు నుంచి పరీక్ష చేసి (కాస్త దూరంగా నిలుచుని) అది బతకదని తేల్చి చెప్పారు. ఈ నెలాకరున

జరిగే పరీక్షల కోసం కేవలం వారం రోజుల నుంచి పుస్తకాలు ముందేసుకున్న నా జేష్ఠ పుత్ర రత్నం కొన్నాక మొదటి సారిగా ముట్టుకున్న ఆ పుస్తకాలు క్రిందపెట్టేసి వచ్చి 'ఎవరైనా ఆస్పత్రికి తీసుకుపోతే బతుకుతుంద'ని హామీ ఇచ్చాడు.

'పోనీ నువ్వేతీసుకు పోరా' అన్నా.

అదనలే బాధలో వుందికదా, పీకుతుందేమో నని, పైగా వెధవ పిల్లులంటే తనకు అసయ్యమని, ఈ పిల్లిని రిక్షాలో తీసుకు పోతుంటే తన ఫ్రెండ్స్ చూస్తారనీ చాలా స్టోరీ చెప్పాడు.

ఓ కప్పులో పాలు పోసి దాని కెదురుగా పెట్టేను. అది తాగలేక పోతోంది. ఓసారి మా బాత్‌రూమ్‌లో దూరే ప్రయత్నం చేసింది. లోపల చస్తుందేమో నన్న అనుమానంతో ఓ కర్ర సిద్ధంగా పెట్టుకుని దాన్ని బయటకు గెంటేను. అది ఊడి పోతున్న పేగులులాక్కుంటూ చెట్టునీడకు చేరింది. మా కాంపౌండులో మేం గాక మరి నలుగురు కాపరాలు వున్నారు. ఇది మా వేపు కాక, పక్కావిడ ఇంటివేపు వెడితే సమంజసంగా వుంటుందేమోనని ఆలోచించాం. పాపం పోవటానికి అది సిద్ధంగా లేదు. దాన్ని చూస్తూ మనం పనులు ఆపుకోలేం కదా, దాని మరణయాతన గురించి మాట్లాడుకొంటూనే మేం టిఫిను తిన్నాం. కాఫీలు తాగేం. వంటకూడా చేసే శాను. మధ్యమధ్యలో పిల్లి బతికుందో, కునికేసిందో చూస్తూనే వున్నాం ఎవరో ఒక ళ్ళం పోయి. మా చిన్నవాడు అందరినీ వరసపెట్టి తిట్టిపోశాడు ఎవరూ దాన్ని ఆస్పత్రికి తీసుకు పోనందుకు. మా ఇంటి దగ్గర్లోనే ఓ పెద్ద నర్సింగ్ హోం, చాలా తక్కువ పేషెంట్లు రావడం వల్ల తీరుబడి ఎక్కువగా వున్న డాక్టరు వున్నారు. మా చిన్నాడు ఆయన దగ్గరకు పోయి అడిగాట్ట 'ఇలా పిల్లి పస్తోంది' అని. ఆయన పాపం సానుభూతిగా జరిగిన విషయం అంతా విని, వాడిని బయటిదాకా తీసుకు వచ్చి, 'ఆ పిల్లి చచ్చిపోయాక తన నర్సింగ్ హోంకి ఎంత దూరంలో పారేయాలో చూపించి మరీ లోపలికి వెళ్ళిపోయాట్ట. చెప్పటం మరిచాను, మా వీధిని మున్సిపాల్టీ సంవత్సరానికోసారి క్లీన్ చేస్తుంది. ఇంట్లో చెత్తని ఎవరికి వాళ్ళం పక్కవాళ్ళ ఇళ్ళ ముందు పోసేస్తూ శుభ్రంగావుంటాం. డ్రైనేజీలు లేవు. అందరి ఇళ్ళముందు భయంకరమైన మురుగు గుంటలు, దోమలు, వాసన ఇవన్నీ వుంటాయి. మేం చాలాసార్లు మా పనిమనిషిచేత మా ఇంట్లో చెత్తంతా డాక్టరుగారి ఇంటిముందు పోయిస్తూ వుంటాం. వాళ్ళు మా వాకిలిని అలాగే వాడు కొంటారనుకోండి. అది వేరే విషయం. ఇళ్ళు, వాకిళ్ళు శుభ్రంగా ఉందడం మావారికి చాలా ఇష్టం. అలాగని ఏనాడు చీపురు

పుచ్చుకుని ఊడవడం నేనే చూడలేదు. ఊరికే ఉపన్యాసాలు ఇస్తూ వుంటారు. అయితే వారి ఉపన్యాసాలకు, చీపురుకుండే శక్తి లేకపోవడంచేత ఇల్లు, వాకిలి ఎప్పుడూ మావారు అనుకొన్నంత శుభ్రంగా వుండనే వుండవు. సరే డాక్టరుగారి హితోపదేశం విన్నాక మావాడు విక్రమార్కుడిలా ఓ రిక్షావాడిని పిల్చుకొచ్చాడు. నేను, మావారు ఇద్దరం కలిసి జమిలిగా పశువుల ఆస్పత్రికి మూడు రూపాయిలు ఇచ్చేలా బేరం ఆడాం. మేమిద్దరం ఒకే మాటమీద నిలబడే సందర్భాలు జీవితంలో బహు తక్కువగా వస్తుంటాయి. ఈ విషయంలో నిలబడ్డాం. అయితే రిక్షావాడు పేషెంటుని చూశాడు, వెనక్కు తగ్గాడు. పశువులాస్పత్రిలో పశువుల సొంత దారు ఉంచేనే వైద్యంట. పిల్లి వాడికిగాను కాబట్టి వైద్యం చేయరని, పైగా అది చస్తే తనకు స్నానంచేయాల్సిన అవసరం ఉందనిడ్యూటీటైమ్‌లోస్నానానికికృష్ణానదివద్దకు వెళ్ళటం కుదరదని తేల్చాడు. మళ్ళీ పిల్లి కేసు మొదటికి వచ్చింది. ఆదలానించుని, పడుకుని దారుణ యాతనపడిపోతోంది. చూడలేకపోయాం. తలుపులువేసుకుని, మేం భోజనాలు అవీ కానిచ్చేసరికి, పాపం అది కాస్త చచ్చిపోయింది. మా పక్కవాళ్ళం దరిమీద నాకు చాలా కోపం వచ్చింది. ఇప్పటిదాకా మేం ఇంత బాధపడి పోతున్నా బయటికి రానందుకు. దొడ్డి అందరిదీ కదా! నా ఒక్కదానికి బాధ్యత అనుకొందుకు ఇదేం నా సొంత ఇల్లా, సొంత పిల్లా! నామటుక్కు నేను ఇంట్లోకిపోయి, ఫేను కింద మంచం వేసుకుని పడుకున్నా.

"పోనీ చచ్చిపోయింది కదా, ఇక నాకు భయంలేదు బయట పారేయనా" అన్నాడు మా చిన్నబ్బాయి.

పక్కవాళ్ళందరికి లేని బాధ మనకెందుకూ? మనకొచ్చిన దుర్వాసన వాళ్ళకి రాదూ? తరువాత చూద్దాములే! అని పెద్దరికం ప్రదర్శించి వాడిని ఆపేశాను. తెల్లవారేసరికి కాస్తంత వాసన మొదలైంది. చీమలు పుట్టలు పెట్టేశాయి. భీభత్సంగా వుంది పిల్లి శవం.

గోర్కీ గురించి నిన్నటినుంచి రాద్దామని కూర్చుంటే వెధవ పిల్లిగోలతోమన శ్శాంతిలేదు. గోర్కీ జీవితం అతని రచనలు, అమ్మ నవల విశిష్టత ఇవన్నీ గురించి మంచి వ్యాసం వ్రాసేను. చదివి చూస్తే నాకే ముచ్చటవేసింది. అవును మరి అంత దుర్భర దారిద్ర్యం అనుభవించటం. అందులోంచి రచనా శక్తిని సాధించటం ఇవన్ని కబుర్లు కాదు. వ్యాసం పూర్తిచేసేసరికి మా చిన్నబ్బాయి ఒకమ్మాయిని తీసుకు వచ్చాడు. ఇరవై ఏళ్ళుంటాయి. బుజాల మీద పాత కాయితాల సంచి వుంది. వెన

కాల ఏడుస్తూ పదేళ్ళ పిల్లాడున్నాడు. ఖాళీ కంచం వుంది వాడి చేతిలో. డబ్బు ఇస్తా నంటాడు మా చిన్నబ్బాయి ఆ పిల్లిని బయట పారేసినందుకు. కాస్త అన్నం పెట్ట మంటుంది ఆ అమ్మాయి ఏడ్చే పిల్లాడి కోసం. ఏదోటి ఎంచుకోమన్నాను నేను.

పోనీ ఆ పిల్లాడికి కాస్త అన్నం పెట్టరాదా! అన్నాడు మా చిన్నాడు. నేను వాడిని ఉరిమి చూసేను.

సరే అన్నమే పెట్టమంది ఆ అమ్మాయి.

ముందు పిల్లిని పారేయమన్నాను.

ఎప్పుడు చచ్చిపోయిందమ్మా! అన్నది ఆ అమ్మాయి.

"రాత్రే నన్నాను"

మనసులో అనుమానం పీకుతోంది. ఆ అమ్మాయి నేను ముట్టుకోనంటుం దేమోనని.

"బంగారసుమంటి పిల్లి!"అన్నదా అమ్మాయి దాన్నితిరగేసి దిగులుగా!

"ఆ పాపం! బాగానే వుంది శుభ్రంగా తిరుగుతుండేది" అన్నాను.

"నిన్ననే చెప్పినట్టయితే బాగుండేదమ్మా వాసనగా వుండ్లా" అన్నది అను మానంగా.

"నిన్ననే పిలుచుంటే బాగుండేదమ్మా తినేవాళ్ళం అన్నది ఆ అమ్మాయే!"

"వెధవ పిల్లిని తింటారా!"

"తింటానికేం లేకుంటే ఏం చేస్తాం! ఏదోటి తినాల. ఉడతలు, పిచికలు.... ఏదైనా తింటాం."

నా బుర్ర తిరిగిపోతోంది.

గిన్నెలో అన్నమంతా ఆ అమ్మాయి కంచంలో కుమ్మరించాను. ఆ ఎండ లోనే ఆ అమ్మాయి, పిల్లాడు ఆ అన్నం ఆత్రంగా తింటున్నారు. పిల్లాడికి కూడా మిగలకుండా ఆత్రంగా, ఆబగా తింటోంది ఆ అమ్మాయి. తల్లితో సమానంగా తినలేక, తినకపోతే తల్లే తినేస్తుందేమో నన్న భయంతో ఉక్కిరి బిక్కిరి అయి పోతూ అన్నం తింటున్నాడు ఆ పసివాడు. నా కబుర్లు, వ్యాసాలు, పత్రికల్లో పొగ డ్తలు, వికృత హాసం చేస్తున్నాయి నా చుట్టూ. అవన్నీ "సత్యం" కాదు. కంపు కొట్టే పిల్లి పక్కనే కూర్చుని, నేను పెట్టిన గుప్పెడు మెతుకులు తింటున్న ఆ తల్లీ పిల్లాడే సత్యం.

*